
# థ్రిల్

*ఆంధ్రభూమి వీక్లీ.. 19 సెప్టెంబర్, 2002*



"ఈ కాలం అమ్మాయిల్ని బుట్టలో వేసుకోవడం చాలా తేలిక!" రాజశేఖర్ అన్నాడు.

"అలా అని ఎలా చెప్పగలవు? ఈకాలం అమ్మాయిలు చాలా తెలివైనవాళ్ళు! మంచీ, చెడ్డా తొందరగా గ్రహిస్తారు... తెలుసా?" మధు అన్నాడు.

"నిజమే కానీ, ఎంత తెలివిగలవాళ్ళయినా అప్పుడప్పుడూ పప్పులో కాలేస్తుంటారు."

"ఇంతకీ... నువ్వు చెప్పదల్చుకున్నదేమిటి?"

"నేను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయి బి.టెక్. చదువుతోంది."

"ఈ విషయం మీ ఆవిడకి చెప్పావా?"

"తమాషా కాదు, నిజంగా చెప్తున్నాను. ఒకరోజు స్కూటర్ ట్రబులిస్తే బస్‌స్టాండ్ కెళ్లాను సిటీబస్ కోసం! అక్కడ ఓ అందమైన అమ్మాయి కనిపించింది. అప్పటినుంచీ రోజూ బస్‌లోనే ఆఫీసుకి వెళ్లసాగాను. పదేపదే ఆమె కళ్ళలో పడడం, ఆమెను తదేకంగా చూస్తూండడం... ఇలా నేనంటే ఆసక్తి కలిగేలా ప్రవర్తించసాగాను. నేను నా వయసుకంటే పదేళ్లు తక్కువ కనిపిస్తానని మీరంతా అంటూంటారు కదా! ఆ ధైర్యంతోనే ముందడుగు వేశాను. ఆ అమ్మాయితో పరిచయం పెంచుకుని, ప్రేమ మొదలై... ఇప్పుడు ఒకరిని విడిచి ఇంకొకరు ఉండలేని పరిస్థితిలో ఉన్నాం."

"కాని... రాజా! నీకు పెళ్ళికి ఎదిగిన కూతురుంది. నీ వయసు కూడా నలభై దాటింది కదా! ఈ వయసులో ఈ పనేమిటి?"

"తప్పేముందీ? నాకు పెళ్ళయి ఇరవై ఏళ్లు దాటింది. జీవితం రొటీన్‌గా, బోర్‌గా అనిపిస్తోంది. నాలో మళ్లీ ఉత్సాహం ఉరకలు వేయడంకోసం, జీవితంలో స్తబ్దత పోవడంకోసం చేస్తున్న ప్రయత్నం ఇది!"

"మరి, ఆ అమ్మాయి గతేమిటి? రేపు నీకు పెళ్ళయిందని తెలిస్తే ఆ అమ్మాయి ఎంత బాధపడుతుంది? ఆ షాక్‌కి తట్టుకోలేక ఏ అఘాయిత్యమైనా చేసుకుంటే ఆ పాపం నీకే అంటుతుంది."

"నాకు పెళ్ళయిన విషయం ఆ అమ్మాయికి తెలుసు!"

"తెలుసా..?" ఆశ్చర్యంగా చూశాడు మధు.

"అవును! ఆ అమ్మాయి నా రెండవభార్యగా స్థిరపడడానికి కూడా సిద్ధమే..." గంభీరంగా అన్నాడు రాజశేఖర్.

"మరి, నువ్వు సిద్ధమేనా?"

"నేనింకా అంతవరకూ ఆలోచించలేదు."

"వద్దురా..! 'లైఫ్‌లో ఛేంజ్' కోసం నువ్వు ఎన్నుకున్న పద్ధతి మంచిది కాదు. నువ్వన్నట్టు ఈ వయసులో పిల్లల చదువులు, ఆర్థిక ఇబ్బందులు, భార్యతో ప్రైవసీ తక్కువవడం... ఇవన్నీ ఒకమాదిరి నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. కొద్దిరోజులు ఓపిక పట్టావంటే నీ పిల్లలు జీవితంలో స్థిరపడతారు. నీ బాధ్యతలు తీరిపోయి, నీ భార్యను ఇంకా ఎక్కువగా ప్రేమించడం మొదలు పెడతావు!" నచ్చచెబుతున్నట్లు అన్నాడు మధు.

"ఎప్పుడు..? యాభై ఏళ్లకా? అయినా- నేను ఆ అమ్మాయిని వాంఛించడం లేదు... ప్రేమిస్తున్నాను. అంతే! ఈ వయసులో పరాయి ఆడపిల్ల నుంచి ప్రేమలేఖలు, ఫోన్‌కాల్స్ అందుకోవడం, హోటల్‌లో కలిసి లంచ్ చేయడం ఎంత ఎగ్జయిటింగ్‌గా ఉంటుందో తెలుసా?"

"నీ ఎగ్జయిట్‌మెంట్ కోసం ఓ అమాయకమైన ఆడపిల్ల జీవితంతో, సున్నితమైన మనసుతో ఆడుకోవడం బాగాలేదు. ఓ స్నేహితుడిగా నీ మంచి కోరి చెబుతున్నాను... నా మాట విను."

"నువ్వు ఒకసారి ఆ అమ్మాయిని చూశావంటే ఈ మాట అనవు సరికదా... నన్ను కంగ్రాచ్యులేట్ చేస్తావు. రేపు సాయంత్రం నీకు వీలైతే ఈ హోటల్‌కి రా! నీకు కావ్యను పరిచయం చేస్తాను" అన్నాడు రాజశేఖర్.

మరుసటిరోజు సాయంత్రం ఆ అమ్మాయిని చూడాలనే కుతూహలంతో హోటల్ కెళ్లాడు మధు.

రాజశేఖర్ కావ్యను మధుకి పరిచయం చేశాడు. 'రూపమే కాదు.., గొంతు కూడా చక్కగా వుంది!' అనుకున్నాడు మధు.

కొంతసేపు మాట్లాడుకున్నాక బేరర్ వచ్చి, "సార్! మీకు ఫోన్..." అన్నాడు రాజశేఖర్‌తో.

అది మధు ఏర్పాటు చేసిందే! కావ్యతో ఒంటరిగా మాట్లాడే అవకాశం కోసం అలా తన ఫ్రెండు చేత ఫోన్ చేయించాడు. రాజశేఖర్ వెళ్లగానే కావ్యతో–

"కావ్యా! ఓ అన్నగా చెబుతున్నాను... నువ్వు చేస్తున్న పని తప్పమ్మా!" అన్నాడు.

"ఒప్పని నేనూ అనుకోవడం లేదు. కానీ, నా మనసు నా మాట వినడం లేదు!"

"తెలిసి తెలిసి ఓ పెళ్ళయినవాణ్ణి ప్రేమించడానికి నీకు ఎలా మనసొచ్చింది? మీ ప్రేమ మరొకరి జీవితాన్ని బలి కోరుతుంది!"

"ఆయనకి పెళ్ళయిన విషయం మొన్నటిదాకా నాకు చెప్పలేదు. ఇప్పుడు తెలిసినా ఇందులోంచి బయట పడలేకపోతున్నాను. ప్రేమలో పడ్డ వాళ్ళ బాధ మీకర్థం కాదు."

"ఎందుకు అర్థంకాదు? వయసులో ఉన్నప్పుడు నేనూ ఓ అమ్మాయిని ప్రేమించాను. కానీ, పెళ్ళి చేసుకోలేకపోయాను. అయితే నాకు పెళ్ళయి, నా భార్య అనురాగం, మంచితనం చూశాక అర్థమైంది– నేనెంత అదృష్టవంతుణ్ణో! నేను ప్రేమించిన అమ్మాయిని తలచుకుని బాధపడింది ఓ నెలరోజులే! నువ్వూ నీ మనసుని సమాధానపరచుకో!"

"నా ప్రేమ నెలరోజుల్లో మర్చిపోయే ప్రేమ కాదు."

దెబ్బతిన్నట్టు చూశాడు మధు. దూరంగా రాజశేఖర్ వస్తూండడం చూసి, "ఓ.కే., నిన్ను చూస్తే ఇవన్నీ మాట్లాడి నిన్ను సరిదిద్దాలనిపించింది. ఇక నీ ఇష్టం!" అన్నాడు.

రాజశేఖర్ రాగానే– "రాంగ్ నెంబర్!" అంటూ కూర్చున్నాడు.

"నేను వెళ్తాను..." అంటూ లేచాడు మధు.

వాళ్ళ మధ్య ఎక్కువసేపు ఉండడం ఇష్టంలేదు అతనికి. అయితే ఆ రాత్రంతా వారిద్దరి గురించే ఆలోచించసాగాడు... 'స్నేహితుడి సంసారాన్ని, ఓ ఆడపిల్ల జీవితాన్ని ఎలా కాపాడగలనా?' అన్నదే అతని ఆలోచన!

• • •

హైదరాబాదు నుంచి బెంగుళూరు తిరిగొచ్చాక, ఆఫీసులో జాయిన్ అయ్యాడు మధు.

తన సెక్షనులో పనిచేస్తున్న కొత్తఅమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆమెని తన సీటుకి పిలిపించుకుని వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

ఆమె పేరు మానస! ఎం.బి.ఎ. చదివింది. తను లీవులో ఉన్నప్పుడు జాయిన్ అయింది.

నాలుగురోజుల తర్వాత ఓ సాయంత్రం తన సీటు వద్దకు వచ్చిన మానసను కూర్చోమని చెప్పి–

"ఎం.బి.ఏ. చదివావు కదా... ఇంత చిన్నఉద్యోగంలో చేరావేం? ఇంకా మంచిఉద్యోగం కోసం ప్రయత్నించలేదా?" అని అడిగాడు.

"ప్రస్తుతానికి ఉద్యోగం నాకు చాలా అవసరం! నేనూ, నాతోపాటు మరోమనిషి బ్రతకడానికి చిన్నఉద్యోగమైనా చేరిపోయాను!"

"ప్రేమ వివాహమా?" అనుమానంగా అడిగాడు.

"కాదు. ఆ మరోవ్యక్తి... మా నాయనమ్మ!"

అర్థంకానట్టు చూశాడు మధు.

"నా చిన్నప్పుడే మా అమ్మ చనిపోయింది. మా నాన్న రెండోపెళ్ళి చేసుకున్నాడు. సవతితల్లి పోరును ఎలాగో చదువయ్యేదాకా భరించాను. మా నాన్న భార్య మాటలు విని, కన్నవాళ్ళను కూడా నిర్లక్ష్యం చేయసాగాడు. మనోవేదనతో మా తాతగారు ఈమధ్యే చనిపోయారు. కనీసం మా నాయనమ్మనైనా దక్కించుకుందామని నేను ఇంటినుంచి బయటకి వచ్చేశాను."

"ఇంతకాలం నిన్ను చదివించిన మీ నాన్నగారిని నీ చదువయ్యాక విడిచి వచ్చేయడం అవకాశవాదం కాదా?"

"కాదు. ఎందుకంటే... హైదరాబాద్‌లో ఉన్న మా మేనమామే నన్ను చదివించారు. నన్ను తనే పెంచుకుంటానన్నాడు. కానీ, మా అత్త ఒప్పుకోలేదు. వాళ్ళమధ్య అభిప్రాయభేదాలు రావడం ఇష్టంలేక మా నాన్నగారితోనే ఉండిపోయి మౌనంగా భరించాను. కానీ, కన్నతల్లిని కూడా అవమానిస్తుంటే ఇక ఆ ఇంట్లో ఉండలేకపోయాను."

ఎక్కడో విన్న కథలా అనిపించడంతో ఆమెను అడిగాడు– "మీ నాన్నగారి పేరు?"

"పతంజలి!"

అనుమానం లేదు– రాజశేఖర్ బావమరిది అతను.

"మీ మేనమామ ఎక్కడ పనిచేస్తున్నారు?"

చెప్పింది.

అయితే... 'మానస' రాజశేఖర్ మేనకోడలన్న మాట!

తనూ, రాజశేఖర్ చదువుకునే రోజుల్లో పతంజలి ఇంటికి వెళ్లేవాళ్ళు. రాజశేఖర్‌కి బంధువు అతను. అతని తండ్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా బాగా సంపాదిస్తుండేవాడు. పతంజలి మద్రాసులో చదివాడు. ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడేవాడు. అందంగా ఉండేవాడు. దానికితోడు... ఐశ్వర్యం! అతన్ని చూసి తను ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో ఫీలయ్యేవాడు. కారణం– తనది మధ్యతరగతి కుటుంబం! ఇంగ్లీషులో ప్రవేశం కూడా అంతంత మాత్రమే! అందుకే అతనితో ఫ్రీగా మూవ్ అవలేకపోయాడు. పతంజలి ఆ తర్వాత రాజశేఖర్ చెల్లెల్నే పెళ్ళిచేసుకున్నాడు. అయితే ఆమె చిన్నవయసులోనే చనిపోయింది. రెండోపెళ్ళి చేసుకున్న పతంజలి తన మేనకోడల్ని సరిగ్గా చూసుకోవడం లేదనీ, ఆమెని తనే చదివిస్తున్నానని రాజా చెప్పేవాడు.

మానసతో మాట్లాడాక మధుకి అనిపించింది–

తను తన తల్లిదండ్రుల్ని ఎంతో బాగా చూసుకున్నాడు. వాళ్ళ బాధ్యతల్ని తనూ పంచుకున్నాడు. వాళ్ళ ఆరోగ్యం కోసం, ఆనందం కోసం శ్రమించాడు. ఇద్దరూ అరవయ్యో ఏటనే చనిపోయినా– కొడుకుగా తన ధర్మం నిర్వర్తించాననే తృప్తి తనకు మిగిలింది. కనుక ఇప్పుడు ఇన్‌ఫీరియారిటీతో ఫీలవవలసింది తను కాదు... పతంజలే!

మానస తన సీటుకి వెళ్లాక– ఆమె ఫైలు వెదికి, అందులోంచి ఆమె ఫోటో తీసుకుని తన పర్సులో పెట్టుకున్నాడు.

• • •

హోటల్ 'తాజ్‌మహల్'లో కలిశారు మధు, రాజశేఖర్.

"ప్రతిసారీ నేను హైదరాబాదుకు రావడమే కానీ, నువ్వు మాత్రం బెంగుళూరు రావడంలేదు. ఇన్నాళ్లూ ఢిల్లీలో ఉన్నాను కాబట్టి అంతదూరం నువ్వు రాకపోయినా నేను నిన్ను అడగలేదు. బెంగుళూరు దగ్గరేగా? రాకూడదా ఒకసారి?!" మధు అన్నాడు.

"వస్తాలే! ప్రస్తుతానికి కావ్య ప్రేమలో పడి బిజీగా ఉన్నాను."

"నా మాటలు విన్న తర్వాత నీలో మార్పు రాలేదా?"

"కావ్య విషయంలో అయితే... మార్పు రాదు."

"కానీ, నాలో వచ్చింది మార్పు!"

"అంటే..?"

"నేనూ నీలా ఓ టీనేజ్ అమ్మాయిని ప్రేమిస్తున్నాను!"

"రియల్లీ..? కంగ్రాట్స్! ఆరునెలలు సావాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారంటారు! అది నిజమే అయింది నీ విషయంలో! ఇంతకీ... అమ్మాయి ఎవరు? ఏం చేస్తుంది? ఎలా మొదలైంది మీ ప్రేమ?"

"పోయినసారి హైదరాబాదు వచ్చివెళ్లాను కదా... ఆ టైంలో ఆఫీసులో కొత్తఅమ్మాయి నా సెక్షన్‌లో జాయిన్ అయింది. చాలా అందంగా, అమాయకంగా ఉంది. జీవితంలో చాలా కష్టాలు పడినట్టు చూడగానే తెలిసింది. నీ మాటల ప్రభావం కూడా నాపై పనిచేస్తూ ఉంది. అందుకే కాస్త జాలి చూపిస్తూ దగ్గరయ్యాను. ఈరోజు నన్ను విడచి ఉండలేని స్థితిలో వుంది!"

"వెరీగుడ్... ఆ అమ్మాయి ఫోటో వుందా నీ దగ్గర?"

పర్సు నుంచి తీసిచ్చాడు.

ఫోటో చూసిన రాజశేఖర్ ముఖంలో రంగులు మారిపోయాయి.

"ఇడియట్! నీకెంత ధైర్యంరా..?"

అతనివైపు చూడని మధు తలవంచుకునే-

"నిన్ను చూశాకే నాకు ధైర్యం వచ్చింది. ఈ విషయంలో నీకు ఏకలవ్య శిష్యుడ్ని నేను!" అన్నాడు.

"షటప్. ఈ అమ్మాయి నా మేనకోడలు!"

"అవునా..?"

- అంటూ ఆశ్చర్యంగా చూశాడు మధు.

"మానస నీ మేనకోడలా? అయ్యో! ఎంత పని జరిగింది?!" అన్నాడు.

"ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. మానసను ఇక వదిలెయ్యి!" అన్నాడు రాజశేఖర్.

"సారీరా! మేం ఒకరిని విడిచి ఒకరం ఉండలేని స్థితిలో ఉన్నాం."

"నా మాటలు నాకే వప్పచెబుతున్నావా?"

"లేదు. నీ మాటలు ఎంత నిజమో అనుభవంతో అర్థమై చెబుతున్నాను."

"చివరిసారిగా చెబుతున్నాను... మానసను వదిలేయ్! అది నా ప్రాణం!"

"కావ్య కూడా నా స్నేహితుడు శ్రీనివాసరావుకి ప్రాణం! ఆమెని నువ్వు వదిలేస్తావా?"

"అంటే... ఇదంతా నాటకమా?"

"కాదు... జీవితం! నీ మేనకోడలు పెళ్ళయినవాడిని ప్రేమిస్తుందని తెలిసి అంత బాధపడ్డావే... మరి, ఆ బాధ- తండ్రిగా ఆయనకు ఎంత ఉంటుంది? పైగా- కావ్య తండ్రి నీ అంత ఆప్తుడు కాకపోయినా... నాకు మంచి స్నేహితుడే! నీ బాధని చూడలేనట్టే ఆయన బాధనీ నేను చూడలేను."

"సారీరా! నా తప్పు తెలుసుకున్నాను... ఇక దిద్దుకునే ప్రయత్నం చేస్తాను."

"గుడ్! నువ్వు ఇంత త్వరగా మారతావని అనుకోలేదు!"

"నా గురించి ఇంత ఆలోచించి నాలో మార్పుకోసం తపించే నీలాంటి స్నేహితుడుంటే ఎందుకు మారను..?!"

"అదికాదు కారణం! తప్పు చేస్తున్నానన్న భావం నీలో కూడా ఉండబట్టే నీకు మారాలని పించింది. నిజం చెప్పాలంటే- టీనేజ్ అమ్మాయి చేత... అదీ అందమైన అమ్మాయి ప్రేమ పొందాలని ఏ మగవాడికి ఉండదు? కానీ, ఆ అవకాశం పెళ్ళికిముందు మాత్రమే వస్తుంది. ఒకవేళ పెళ్ళయ్యాక ఆ అవకాశం వచ్చినా... సంతోషం కంటే భయమే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే- ఆ ప్రేమని సమాజం ఒప్పుకోదు గనక! అంతెందుకు- మన చేతిలో ఓ పది లక్షలుంటే బాగుంటుందని అనుకుంటాం. నిజంగానే ఒకవ్యక్తి నీ చేతిలో పదిలక్షలు పెట్టి తీసుకోమంటే తీసుకోవు. అది ఏ దొంగిలించిన సొమ్మో అయి వుంటుందని, లీగల్ ప్రాబ్లెమ్స్ వస్తాయని భయపడతావు. అదే నీ జీతం వెయ్యిరూపాయలు పెరిగినా ఏదో సాధించినట్టు సంతోషపడతావు! ఇంకో విషయం- మనం పెరిగిన వాతావరణం, మన పెద్దలు నేర్పించిన క్రమశిక్షణ మనతో మంచిపనులే చేయిస్తాయి. అవి మన నరనరాల్లో జీర్ణించుకునిపోయి వున్నాయి కనుక! అందుకే కావ్యతో పరిచయమైన ఆరునెలలైనా ఆమెని నువ్వు మరోవిధంగా వాడుకోలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కంటే, కాలకముందే నిప్పును దూరంగా ఉంచమని వేడుకుంటున్నాను!"

మధు చేతిని గట్టిగా పట్టుకుని-

"సారీరా! నిన్ను ఎంతో బాధపెట్టాను. నిజానికి నేను కావ్య విషయంలో సంతోషంగా లేను. నువ్వన్నట్టు తప్పుచేస్తున్న భావం నాలో ఉంది. ఇక ఈ సంఘర్షణకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తాను... ప్రామిస్!" అన్నాడు రాజశేఖర్.

"థాంక్యూ! అన్నట్టు... నీ మేనకోడలు మానస మా ఆఫీసులో చేరింది. నేను నా కూతుర్లా చూసుకుంటాను. ఆమె విషయంలో నిశ్చింతగా ఉండు!" అన్నాడు మధు.

బెంగుళూరు వెళ్లాక- భార్య శ్యామలతో విషయమంతా చెప్పి, "కథ అలా సుఖాంతమైంది!" అన్నాడు.

"మరి, మీ ఫ్రెండ్ శ్రీనివాసరావుని నాకెప్పుడూ పరిచయం చేయలేదే?" అడిగింది శ్యామల.

"ఆయనెవరో నాకు తెలిస్తే కదా నీకు పరిచయం చేయడానికి! కావ్య తండ్రిపేరు శ్రీనివాసరావు అన్న విషయం మాత్రమే నాకు తెలుసు!" అన్నాడు మధు.

ఆశ్చర్యంగా, గర్వంగా భర్తను చూస్తూ ఉండిపోయింది శ్యామల.